

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది

ఆసిఫాబాద్, జనవరి 6: పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుందని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. జిల్లాలో ఏఎస్సైలుగా పని చేస్తూ ఎస్సైలుగా పదోన్నతి పొందిన ఆర్ తిరుమల, ఎం రాములు, పి చంద్రమిశ్రా, ఎం బోజరావ్, ఆర్ వెంకటేశ్వర్‌లను శనివారం ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందన్నారు. పెరిగిన బాధ్యతను క్రమ శిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీసు శాఖపై నమ్మకం, గౌరవం పెంచే విధంగా ఉండాలని అన్నారు. కష్ట పడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు.

నేడు కాగజ్‌నగర్‌లో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలకు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

కాగజ్‌నగర్, జనవరి 6: 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో ఏటేటా నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ పార్కులైన్‌లో జరుగనున్నాయి. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగుళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన ఆధ్వర్యంలో జరుగనున్నాయి. స్థానిక ఆదిత్యనర్సింగ్‌హోం, ఎమర్ కనస్ట్రక్షన్స్ వారి సౌజన్యంతో బహుమతులను స్పాన్సర్ చేస్తున్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలు శనివారం ఉదయం 9 గంటల వరకు కాగజ్‌నగర్ సర్‌సిల్క్ పార్కులైన్ గ్రౌండుకు చేరుకోవాల్సి ఉంటుంది. ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయా బహుమతి రూ.3వేలు అందజేయనున్నారు. ఈ పోటీల్లో కేవలం మహిళలు మాత్రమే పాల్గొనాల్సి ఉంటుంది. చుక్కల ముగ్గు మాత్రమే అనుమతిస్తారు. ముగ్గులకు కావాల్సిన రంగులు, ఇతర సామగ్రి పోటీల్లో పాల్గొనే వారే తెచ్చుకోవాల్సి ఉంటుంది. ముగ్గు వేయడానికి రెండు గంటల సమయం ఉంటుంది. ముగ్గుల్లో గొబ్బెమ్మలు, బతుకమ్మ వంటివి అమర్చవచ్చు. ముగ్గుకు అందం ఇవ్వడానికి వస్తువులను వాడాలి తప్ప అవే ప్రధానాంశాలు కాకూడదు.

గిరిజన ఆశ్రమ పాఠశాల మంజూరు చేయాలి

సిర్పూర్(యు), జనవరి 6:మండలంలోని బాండేయేర్ గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల మంజూరు చేయలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ నర్సింహారెడ్డికి వీటీడీఏ మండల చైర్మన్ కుమ్ర భీంరావు వినతి పత్రం అందించారు. శనివారం హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో కమిష నర్‌ను కలిసి పలు ఆంశాలతో ఉన్న వినతి పత్రంను అందించారు. కమిషనర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నాగోరావు, మహాదు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నర్సరీ పనులు ప్రారంభం

వాంకిడి, జనవరి 6: వాంకిడి మండలంలోని ఖమాన గ్రామంలో నూతన నర్సరీ పనులను సర్పంచ్ పెందోర్ పవన్ ప్రారంభించారు. నర్సరీ పనులను త్వరగా పూర్తి చేసి గ్రామ పంచాయతీ ప్రజలకు మొక్కలు పంపిణీ తగు చర్యలు తీసుకోవాలని ఎఫ్ఏలకు సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఏలు దేవిదాస్, కారోబార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దరిగాం అడవుల్లో అనుమానాస్పద స్థితిలో పులి మృతి


కాగజ్‌నగర్, జనవరి 6: కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో పులి మృతి చెందింది. టైగర్ మానిటరింగ్ టీం సభ్యులు శనివారం దరిగాం అటవీ ప్రాంతాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. పులి మృతి ఫొటోలు, వీడియోలను తీశారు. అనంతరం పశువైద్యాధికారితో పంచనామా నిర్వహించారు. మహారాష్ట్ర మీదుగా సిర్పూరు(టి), వేంపల్లి, దరిగాం, వాంకిడి కారిడార్ ఉండడంతో పులులు రాకపోకలు సాగిస్తుంటాయి. రెండు పులుల మధ్య ఘర్షణతోనే పులి మృతి చెందినట్టు టైగర్ మానిటరింగ్ టీం ప్రాథమిక నిర్ధారణ చేసింది. తరుచూ పశువులపై దాడి చేసి చంపేస్తుండంతో ఈ ప్రాంత వాసులు ఉచ్చు వేసి పులిని చంపినట్టు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ టిబ్రేవాల్‌ను వివరణ కోరగా రెండు పులుల ఘర్షణతోనే మృతి చెందినట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చామన్నారు. అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నామన్నారు. త్వరలోనే పులి మృతికి సంబంధించిన వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

మూడు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

జైనూర్, జనవరి 6: జైనూర్ మండల కేంద్రంలోని రెండు జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లను ఆది, సోమ, మంగళవారాల్లో నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్‌ఖాన్ శనివారం ఒక ప్రకటలో తెలిపారు. పత్తి నిల్వలు ఎక్కువగా ఉండడంతో మూడు రోజులపాటు పత్తి కోనుగోలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కౌలు రైతుల్లో చిగురిస్తున్న ఆశలు





- రూ.15వేలు చెల్లిస్తామన్న కాంగ్రెస్
- ఏటేటా పెరుగుతున్న కౌలు రేట్లు
- కౌలు చట్టాలు అమలైతే 20వేల మందికి మేలు
- విధివిధానాలు రూపొందించాలని వినతి

చింతలమానేపల్లి, జనవరి 6: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులకు భరోసా ఇచ్చేందుకు హామీ ఇవ్వడంతో వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకొని పంటలు పండించే కౌలు రైతులను ఆదుకుంటామని, వారికి ఏటా రూ.15వేల సాయం అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. వారికి ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం విధివిధానాలు రూపొందించి రైతాంగాన్ని ఆదుకోవాలని కౌలు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. భూములు లేని పేద రైతులను గత ప్రభుత్వం ఇన్నాళ్లు పట్టించుకోలేదు. ఎన్నికల సందర్భంగా కౌలు రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ చెప్పడంతో ప్రస్తుతం అధికారంలోకి వచ్చినందున ఆశలు చిగురించాయి. చీడ, పీడల కారణంగా పంటలు దెబ్బతిన్నా, చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు, అతివృష్టి, అనావృష్టి, ఇతరత్రా ప్రకృతి విపత్తులతో కౌలు రైతులు నష్టపోయినా ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం భూయ జమానికి కౌలు ధర చెల్లించాల్సిందే. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కౌలు రైతులను ఆదుకుంటామని వారి కి ఏటా రూ. 15వేల సాయం అందజేస్తామని హామీ ఇచ్చింది. అదే పార్టీ అధికారంలోకి రావడంతో కౌలు రైతులకు మంచి రోజులు వచ్చే అవకాశం ఉందని కౌలు రైతులు చెబుతున్నారు.

కౌలు ధర పెరగడంతో..

ప్రతీ ఏటా కౌలు ధరలు పెరుగుతుండడంతో రైతులపై తీవ్రంగా ఆర్థిక భారం పడుతోంది. ప్రస్తుతం నీటి వసతులు ఉన్న భూమికి రూ. 15వేలు, నీటి వసతులు తక్కువగా ఉన్న భూములకు రూ. 10-12 వేలు ధర పలుకుతోంది. ఈ మొత్తాన్ని ముందుగానే కౌలు రైతు భూయజమానికి అందజేయాల్సి ఉంటుంది. పదేళ్లలో కౌలు ధరలను పరిశీలిస్తే దాదాపుగా మూడు రేట్లు పెరిగాయి. 2010లో ఎకరానికి రూ. 3 నుంచి 5 వేల వరకు ఉన్న కౌలు భూముల ధరలు, 2022లో 12వేలకు పెరిగాయి. కాగా 2023 లోనూ 12 నుండి 15వేల ధర పలుకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలతో సంబంధం లేకుండా ముందుగానే మాట్లాడుకున్న తీరును బట్టి భూయజమానులకు డబ్బు చెల్లించాల్సి ఉంటుంది.

అధికమైన పెట్టుబడులు..

పంటలు పండించేందుకు కౌలు రైతులు పెట్టే పెట్టుబడులు సైతం అధికంగానే ఉన్నాయి. సరాసరి ఎకరా భూమి దున్నేందుకు ట్రాక్టర్ కిరాయి 5వేలకు వరకు చెల్లించాల్సివస్తుందని చెబుతున్నారు. రైతులు. అలాగే నాటువేయడానికి రూ. 5వేలు, ఎరువుల కోసం, కలుపు తీసేందుకు రూ.7వేలు, పంట చేతికొచ్చే సమయంలో కోత మెషీన్‌కు రూ.3 వేలు, ఈ లెక్కన ఎకరా సాగు చేసేందుకు కౌలు రైతులు సరాసరి రూ. 20 నుంచి 25వేలకు వరకు ఖర్చు చేస్తున్నారు. పెట్టుబడులు ఏటా పెరుగుతుండడంతో కౌలు రైతుల్లో ఆర్థిక భారం పెరుగుతోంది. గత రెండు, మూడేళ్లుగా విపరీతంగా ధరలు పెరిగాయి. జిల్లాలోని 15 మండలాల పరిధిలో సుమారుగా 20వేల వరకు కౌలు రైతులు ఉన్నారు. కౌలు రైతులకు కనీసం బ్యాంకుల్లో రుణాలు లభించకపోగా, పెట్టుబడుల కోసం ప్రైవేటు వడ్డీ, వ్యాపారులను ఆశ్రయించి ఇబ్బందులు పడుతున్నారు.

కౌలు చట్టాలు అమలైతే మేలు..

కౌలు రైతులకు ప్రభుత్వ పరంగా సహయసహకారాలు అందించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ లైసెన్స్‌డ్ కల్టివేటర్ రూల్స్ 2012 చట్టం అమల్లో ఉండేది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం రావడంతో ఆ రూల్స్ కనుమరుగయ్యాయి. 2016-17 వరకు రూల్స్ అమలు చేసినా ప్రభుత్వం అనంతరం పట్టించుకోలేదు. చట్టంలో భాగంగా రెవెన్యూ అధికారులు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసేవారు. జీపీ కార్యాలయాల వద్ద రైతుల వివరాలు నమోదు చేసేవారు. కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు అందేవి. క్రాప్ లోన్లు మినహాయించి రుణాలు పొందేందుకు ఉపయోగపడేవి. అయితే కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏటా ఎకరానికి రూ. 15వేలు ఇస్తామనడం, కౌలు రైతులకు కూడా రూ. 15వేల సాయం అందిస్తామని పేర్కొనడంతో విధివిధానాలు రూపొందించి త్వరగా కౌలు రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

కౌలు రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి..: కార్తీక్, కౌలు రైతు..



రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతాంగాన్ని ఆదుకోవాలి. మాకు సొంతంగా రెండు ఎకరాల భూమి ఉంది. మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాం. ఏటేటా పెట్టుబడులు పెరుగుతున్నాయి. వాతావరణ పరిస్థితులతో పంట దిగుబడి రాక పెట్టుబడులు సైతం రాని పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ. 15వేలు అందజేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

ఆధార్ కలిగి ఉండాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, జనవరి 6: జిల్లాలోని పీటీజీ (ఆదిమ గిరిజన సమూహం) కులాల వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు కలిగి ఉండాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శనివారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్‌డీవో సురేష్‌తో కలిసి పీజీటీ కుల సంఘాల నాయకులు, పటేళ్లతో ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం ద్వారా పీజీటీల అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీటీజీ ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన జన్‌మన్ పథకం లబ్ధి పొందాలంటే జిల్లాలోని పీటీజీ కులాల వారు తప్పని సరిగా ఆధార్‌ను కలిగి ఉండాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా జన్‌మన్ బ్యాంకు ఖాతా, కుల ధ్రువీకరణ ప్రతం కలిగి ఉండాల న్నారు. ఈ నెల 15ను లోగా సంబంధిత పత్రాలను అన్ని కలిగి ఉండేలా కుల సంఘాల నాయకులు , పటేళ్లు, పీజీటీ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధాన మంత్రి కిసాన్ క్రెడిట్ కార్డు, ఆయుష్మాన్ భారత పథకం కింద హెల్త్ కార్డులు జారీ చేస్తామన్నారు. పీటీజీ ప్రజల అభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రాణహితలో ఒకరి గల్లంతు

బెజ్జూరు, జనవరి 6: బెజ్జూరు మండలంలో బోనాల సందర్భంగా ప్రాణహిత నదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఒకరు గల్లంతయ్యారు. పెంచికల పేట మండలం లోడ్‌పల్లికి చెందిన ఆత్రం ధర్మయ్య(45) అనే వ్యక్తి శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి సోమిని ప్రాణహిత రేవులోని ఎర్రబండ వద్ద స్నానం చేయడానికి నదిలోకి దిగాడు. కుటుంబ సభ్యులు, మిత్రుల సమక్షంలో వరద ప్రవాహంలో కొట్టుకు పోతుండగా అక్కడ ఉన్న వారు కాపాడేందుకు ప్రయత్నం చేసినప్పటికీ ఫలించలేదు. రాత్రి వరకు ప్రాణహిత నదిలో గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. ఈ విషయమై ఎస్సై విక్రంను సంప్రదించగా ఫిర్యాదు అందలేదన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

బెజ్జూరు, జనవరి 6: మండలంలోని పాపన్నపేట గ్రామానికి చెందిన దాసరి అశోక్(30) అనే యువకుడు శనివారం చేపల కోసం వెళ్లి నీటి కుంటలో పడి మృతి చెందినట్లు ఎస్సై విక్రం తెలిపారు. పాపన్నపేటకు చెందిన అశోక్‌తో పాటు లింగంపల్లి ఆశయ్య, ఎలకరి లింగయ్య కలిసి గ్రామ సమీపంలో ఎక్స్‌కవేటర్‌తో తీసిన గుంతలో చేపలు పట్టేందుకు దిగారు. గుంతలో నీరు అధికంగా ఉండడంతో అశోక్ మునిగిపోయాడు. లింగంపల్లి ఆశయ్య, ఎలకరి లింగయ్యలు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా అశోక్ అప్పటికే మృతి చెందాడు. అశోక్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

భూ తగాదాల నేపథ్యంలో ఒకరి హత్య

తిర్యాణి, జనవరి 6: తిర్యాణి మండలం మాణిక్యాపూర్ గ్రామ పంచాయతీ పరిధి రాజాగూడకు చెందిన ఆత్రం తిరుపతి(42) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడరు. తిర్యాణి ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్రం తిరుపతి శుక్రవారం రాత్రి తన చేనులోకి పందుల నుంచి పంటను రక్షించుకునే క్రమంలో కావలికి వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటికి తిరిగి రాక పోవడంతో తిరుపతి భార్య కళావతి తన కుమారుడిని చేను వద్దకు పంపించింది. ఇంటికి తిరిగి వచ్చిన కుమారుడు తిరుపతి మంచడంపై పడి ఉన్నాడని తెలపడంతో కళావతి అక్కడికి వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొంత కాలంగా మడావి మారు, మడావి శంకర్ అనే వ్యక్తులు తమ ఎనిమిది ఎకరాల పంట చేను తమదేనంటూ తరచూ బెదిరిస్తున్నారని. తన భర్తను వారే హత్య చేసి ఉంటారని కళావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై రమేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సింగరేణిలో కొత్త గనులకు శ్రీకారం

- సీఎండీ ఎన్ బలరామ్



మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

శ్రీరాంపూర్, జనవరి 6: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సింగరేణిలో కొత్త గనులకు శ్రీకారం చుడుతామని సీఎండీ ఎన్ బలరామ్ అన్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి కార్యాలయంలో కొత్త గనులు, సోలార్ ఉత్పత్తిపై ఆయన శనివారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగూడెం, ఎల్లందు ఏరియాల్లో వీకే ఓపెన్ కాస్ట్, రొంపేడు ఓపెన్ కాస్టులకు సంబంధించిన అనుమతులను త్వరగా తీసుకొని బొగ్గు ఉత్పత్తి చేయాలని ఆదేశించారు. బెల్లంపల్లి ఏయాలో ప్రారంభించాల్సి ఉన్న గోలేటి ఓపెన్ కాస్ట్ అనుమతులు పొంది ఏడాదికి 4 లక్షల టన్నుల బొగ్గును వెలికితీయాలని సూచించారు. సోలార్ పవర్‌పై నిర్వహిం చిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజస్థాన్, గుజరాత్, కర్ణాటక, తదితర రాష్ట్రాల్లో సోలార్ పవర్ ఉత్పత్తికి ప్రణాళికలు వేస్తున్నట్లు చెప్పారు. ఎస్‌టీపీపీలో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ టెండర్‌ను కూడా అతి త్వరలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు డి. సత్యనారాయణరావు(ఈఅండ్‌ఎం), ఎన్‌వికె శ్రీనివాస్ (ఆపరేషన్స్), జి వెంకటేశ్వర్ రెడ్డి(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), ఈడీ(కోల్ మూమెంట్) జె అల్విన్, జీఎం(కోఆర్డినేషన్) ఎం సురేష్, చీఫ్ (ఓఅండ్‌ఎం) జెఎన్‌సింగ్, జీఎం(సోలార్) జానకీ రామ్, జీఎం (సివిల్) సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై జీఎం సమీక్ష

మందమర్రి టౌన్, జనవరి 6: మందమర్రి ఏరియా జీఎం ఎం మనోహర్ తన కార్యాలయంలో సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లపై శనివారం అన్ని గనుల, డిపా ర్టుమెంట్ల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు ఆర్కే 1ఏ సమీపంలోని పాలవాగు వద్ద నిర్వహించనున్న జాతరకు చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు.

సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

కాసిపేట, జనవరి 6: సింగరేణి ఓసీపీలో ఇండ్లు, భూములు కోల్పోయిన దుబ్బగూడెం భూనిర్వాసితుల కోసం నిర్మిస్తున్న లే అవుట్ కాలనీ ఇండ్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శనివారం లే అవుట్ కాలనీలో ప్రసన్నాంజనేయ గుడి నిర్మాణ పనులకు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. 2013 భూనిర్వాసిత చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తే నష్టపోతామని, కొత్తగా ఇండ్ల నిర్మాణ పథకంలో చేర్చి అదనంగా డబ్బులు ఇప్పించాలని నిర్వాసితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అర్హులైన వారికే ఇండ్లను కేటాయించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, బోగె రామకృష్ణ, శ్రీనివాస్, పోశం,రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ కరపత్రాలు విడుదల

ఆసిఫాబాద్, జనవరి 6: ఆసిఫాబాద్ మండలం వావుదాం గ్రామ పంచాయతీ పరిధిలోని గంటలగూడ గ్రామంలోని అన్నారం భీమయ్యక్ ఆలయ వార్షికోత్సవ కరపత్రాలను శనివారం సహకార చైర్మన్ అలీబీన్ అహ్మద్, కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఆది, సోమవారాల్లో ఆలయ వార్షికోత్సవం సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఆసక్తి గల క్రీడా జట్లు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గంగారాం, కట్టిరావ్, రాము, అనీల్, నీలకంఠరావ్ తదితరులు పాల్గొన్నారు.

20న రాములోరి అక్షింతల పంపిణీ

తిర్యాణి, జనవరి 6: తిర్యాణి మండలంలో ఈ నెల 20న అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలను శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వ ర్యంలో ఇంటింకీ పంపిణీ చేయనున్నట్లు కమిటీ అధ్యక్షుడు శంకర్‌గౌడ్ తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహించే శోభాయాత్రకు శనివారం సమావేశం నిర్వహించి కమిటీని ఎన్నుకోనున్నట్లు చెప్పారు. 20 మంది కార్యనిర్వా హక సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేత

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 6: కలెక్టర్ హేమంత్ బోర్కడేతో పాటు రవాణా శాఖాధికారి గంధం లక్ష్మిని ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాయకుడు గోపాల్ ఉన్నారు.

దుస్తులు పంపిణీ

జైనూర్, జనవరి 6:మండల కేంద్రంలో శనివారం ఆదివాసీ జంగో లింగో దీక్ష స్వీకరించే వారికి అనక దేవేందర్ ఫౌండేషన్ అధ్వర్యంలో దీక్ష దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ దైవ చింతనంతోనే సమాజంలో శాంతి నేలకొంటుంద న్నారు. ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో పయనించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు జన్నావార్ పవన్ కుమార్,మడావి రమేష్‌దత్తు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

జైనూర్, జనవరి 6: జిల్లా కేంద్రంలో శనివారం ప్రొఫెసర్ హైమాన్ డార్ఫ్ దంపతుల వర్థంతి పోస్టర్లను ఎస్పీ సురేష్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరిస్తారు. జైనూర్ మండలం మార్లవాయిలో ఈ నెల 11న నిర్వహించే హైమాన్ డార్ఫ్ వర్ధంతి కార్యక్రమానికి హాజరు కావాలని ఎస్పీని ఆహ్వానించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు మడావి మధు, ఆత్రం భగవంత్‌రావు, గెడం గణపత్‌రావు, కనక భరత్, కనక లంకేశ్వర్, సోయం రాజు, కనక సుదర్శన్, ధర్మేందర్ పాల్గొన్నారు.

సీఆర్టీకి ఆర్థిక సాయం

బెజ్జూరు, జనవరి 6: బెజ్జూరు మండలంలోని డబ్బాగూడ గ్రామానికి చెందిన సీఆర్టీ సిడాం గోవర్ధన్‌కు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. గత నెలలో నిర్వహించిన ఎన్నికల్లో భాగంగా శిక్షణ కోసం ఆసిఫాబాద్‌కు వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో గాయ పడి రెండు కాళ్లు విరిగా పోయాయి. ప్రమాదారికి గురై కరీంనగర్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యం కోసం ఇప్పటికే ఆరు లక్షలు ఖర్చు కాగా సీర్టీలంతా వైద్యఖర్చుల నిమిత్తం జమ చేసిన రూ.34 వేలను కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు.

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం

దహెగాం, జనవరి 6: దహెగాం మండలం గిరివెల్లి గ్రామానికి చెందిన కోటారి ఇస్తారి ఇంట్లో నిలువ చేసిన పత్తి శనివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు ద గ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్తారి క టుంబ సభ్యులతో కలి సి చేనుకు వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో నుంచి దట్టమైన పొగలు రావడాన్ని ఇరుగుపొరుగు వారు గమనించారు. పత్తికి మంటలు అంటుకోవడంతో చట్టుపక్కల వారు బకెట్లు, బిందెలతో నీటిని పోసి ఆర్పి వేశారు. ఇస్తారికి సమాచారం అందించగా ఇంటికి చేరుకొని కన్నీంటి పర్యాం తమయ్యాడు, 20 క్వింటాళ్లకు పైగా పత్తి కాలిపోయిందని అధికారులు స్పందించి పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశాడు.

జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 6: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి రాజపెటే వికీ జాతీయ స్థాయి అండర్-17 సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. ఈ నెల 22న నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.

శ్రీరామ పూజిత అంక్షితల పంపిణీ

బెజ్జూరు, జనవరి 6: అయోధ్య శ్రీరామ పూజిత అంక్షితను శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. మండలంలోని చిన్న సిద్దాపూ ర్, పెద్ద సిద్దాపూర్ గ్రామాలకు చెందిన భక్తులు చిన్నసిద్దాపూర్ హనుమాన్ ఆలయం నుంచి బెజ్జూరు రంగనాయక ఆలయం వరకు మంగళవాయిద్యాలతో శోభాయాత్ర నిర్వహించారు.

పెంచికలపేట: అయోధ్య శ్రీరామ పూజిత అంక్షితను శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. మండలంలోని ఎల్కపల్లి, మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లో గడపగడపకు వెళ్లి అందజే శారు.

ఆన్‌లైన్ నమోదు పరిశీలన

దహెగాం, జనవరి 6: దహెగాం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో కొనసా గుతున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ డాటా ఎంట్రీ విధానాన్ని శనివారం ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ పరిశీలిం చారు. డాటా ఎంట్రీ విధానం సక్రమంగా చేపట్టాలని కార్యదర్శులతో పా టు కంప్యూటర్ సిబ్బందికి సూచించారు.

భారత్ పెట్రోల్ బంకులో కల్తీ



బంక్ సిబ్బందితో వాగ్వాదం

జన్నారం, జనవరి 6 : మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్‌లో కల్తీ పెట్రోలు పోయడంతో ద్విచక్ర వాహనాలు ఆగిపోయాయి. కొందరు మెకానిక్‌ల వద్దకు వెళ్లి చూపించగా పెట్రోలు కల్తీ జరిగిందని తెలియడంతో వినియోగదారులు శనివారం పెట్రోలు బంక్ వద్దకు చేరుకుని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న బంక్ యాజమాని సునీతజగన్ చేరుకుని ఆరా తీయగా ఉదయమే పెట్రోలు అయిపోయిందని, ట్యాంకర్ ద్వారా సగం అన్‌లోడ్ జరిగిందని, దాని ద్వారా పెట్రోలు పోయగా ఇలా వచ్చిందని గమనించారు. ట్యాంకరే కల్తీగా ఉందని పెట్రోలు బంక్‌కు సంబంధం లేదని వాహనదారులకు సర్ది చెప్పినా వారు వినలేదు. ద్విచక్ర వాహనాల రిపేరుకు ఖర్చులు ఇస్తామని బంక్ యజమాని తెలిపారు. ఆర్‌ఐ గంగరాజు చేరుకుని నమూనాలు సేకరించి పెట్రోలు విక్రయాలను జరగకుండా సీజ్ చేశారు.

వందుర్‌గూడలో ప్రజాపాలన బహిష్కరణ

దండేపల్లి, జనవరి 6: వందుర్‌గూడ గిరిజన గ్రామానికి చెందిన ఆదివాసి గిరిజనులు ప్రజాపాలన కార్యక్రమాన్ని శనివారం బహిష్కరించారు. శనివారం వందుర్‌గూడలో అధికారులు గ్రామానికి రాగా గిరిజనులు ఏ ఒక్కరు దరఖాస్తు సమర్పించలేదు. అధికారులను గ్రామానికి రానివ్వకుండా ఊరు పొలిమెర అడ్డుకొని ప్రభుత్వం చేపట్టే ఏ సంక్షేమ కార్యక్రమాన్ని నిర్వహించవద్దని నిరసన తెలిపారు. వందుర్‌గూడ గ్రామ పంచాయతీని రద్దు చేసి నెల్కివెంకటాపూర్‌లోనే కొనసాగించాలని అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. కలిసి ఉన్న మమ్మల్ని విడిదీసి వందుర్‌గూడ గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయడంపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల నుంచి నిరసన చేపట్టినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు పీసా చట్టాన్ని గౌరవించడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ గూడాన్ని నెల్కివెంకటాపూర్ గ్రామ పంచాయతీలో కొనసాగించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామపటేల్, ఆదివాసి గిరిజనులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి పెంకుటిల్లు దగ్ధం

దండేపల్లి, జనవరి 6: రెబ్బనపల్లి గ్రామానికి చెందిన గోళ్ల పూర్ణచందర్‌కు చెందిన పెంకుటిళ్లు శనివారం గ్యాస్ సిలిండర్ పేలి మంటలు చెలరేగడంతో పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న సామగ్రి, ధాన్యంతో పాటు రూ.3లక్షల నగదు,, రెండు తులాల బంగారం, వెండి ఆభరణాలు బూడిదయ్యాయి. సుమారు రూ.14లక్షల మేరకు ఆస్తి నష్టం వాటిందని బాధితుడు వాపోయాడు. ఆర్‌ఐ చంద్రమౌళి పంచనామా చేశారు.

ఇండ్లపై ఉన్న కరెంటు వైర్లను తొలగించాలి

కోటపల్లి, జనవరి 6: బోరంపల్లి గ్రామంలో ఇండ్లపై ఉన్న కరెంటు వైర్లను తొలగించాలని శనివారం తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఇప్పటికే వైర్లు ఉండగా, మళ్లీ కొత్త లైన్‌లకు అనుమతి వచ్చిందని అధికారులు వచ్చి పనులను ప్రారంభించడంతో అడ్డుకున్నామన్నారు. అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరారు. సర్పంచు రాజగౌడ్, ఉపసర్పంచు కుబేర్, కృష్ణదాస్, ప్రదీప్, పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు



ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రేంసాగర్‌రావు

ఏసీసీ, జనవరి 6: పార్టీలకతీతంగా ప్రజలందరూ తనకు సమానమనని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం పాత మంచిర్యాలలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రజలందరి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల నుంచి పాత పింఛన్‌దారులకు నెలకు రూ.4 వేల పింఛన్ అందిస్తామన్నారు. ప్రజాపాలనలో పింఛన్‌ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి మూడు, నాలుగు నెలల్లో పింఛన్‌లు అందేలా చూస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం సొంతభూమి ఉన్నట్లయితే ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు, ఇతరులకు రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. రిటైర్డు సింగరేణి కార్మికులు నెలకు రూ.10 వేల పింఛన్ పొందుతున్న వారికి తెల్ల రేషన్ కార్డు అందించనున్నట్లు తెలిపారు. రంగపేట, స్లమ్ ఏరియాల్లో రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేస్తామన్నారు. ఆండాలమ్మ కాలనీ డంపింగ్‌యార్డును సింగరేణికి చెందిన నిర్మానుష్య ప్రదేశానికి మార్చిలోగా తరలిస్తామని హామీఇచ్చారు ఫిబ్రవరిలో ఐబీలో ఉన్న ఆర్‌అండ్‌బీ, ఆర్డీవో కార్యాలయం, క్వార్టర్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూల్చివేసి ప్రభుత్వ ఆసుపత్రికి అనుబంధంగా 600 పడకలతో కొత్త ఆసుపత్రిని నిర్మించి మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని అందులో ఏర్పాటు చేస్తామన్నారు. డీఆర్‌డీఏ పీడీ శేషాద్రి, జెడ్పీ సీఈవో నరేందర్, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, కౌన్సిలర్లు బొలిశెట్టి సునీత, మహేశ్వరి, బానేష్, నాయకులు పూదరి తిరుపతి, నరేష్,పెంట రజిత పాల్గొన్నారు.

నస్పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని, అర్హులైనా వారందరికి అందే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. తీగల్‌పహాడ్ లక్ష్మి గార్డెన్‌లో 18, 19, 20, 21 వార్డులకు సంబంధించిన ప్రజాపాలన అభయహస్తం గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులందరికి ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తొలగించి ఆ స్థలాలను నిరుపేదలకు పంచే ప్రయత్నాలు చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, కౌన్సిలర్లు సుర్మిళ్ళ వేణు, సీపతి సుమతి, కుమార్, రేగుంట చంద్రశేఖర్, దాసు, బండి పద్మ, సంధ్యారాణి, రజిత, లక్ష్మి, లహరి, అగల్‌డ్యూటి రాజు, సీడాం మహేష్, నాయకులు బండారి సుధాకర్, దారవేని తిరుపతి, ధరణి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: మండలంలో ప్రజాపాలన కార్యక్రమం ముగిసింది. శనివారం కొమ్మెర, ఎర్రగుంటపల్లి, చెల్లాయిపేట గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులు ఇవ్వని వారు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలో అందజేయవచ్చని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, ఎంపీవో ఆజ్మత్ అలీ, ఏపీవో గంగాభవానీ, ఏవో కవిత, సర్పంచులు పాల్గొన్నారు.

చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్టు పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న డీఈవో యాదయ్య

ఏసీసీ, జనవరి 6: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి నిర్వహించనున్న చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్టు వాల్ పోస్టర్లను శనివారం విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో యాదయ్య విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రగతి, స్వావలంభన కోసం సైన్స్ అనే నినాదాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 19న పాఠశాల, ఈ నెల 27న మండల, ఫిబ్రవరి 3న జిల్లా స్థాయిలో, ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతుందన్నారు. వేదిక ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిష్టయ్య మాట్లా డుతూ జిల్లాలోని 18 మండలాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, దేవన్న ,ఉపేందర్,యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుల బైండోవర్

ఏసీసీ, జనవరి 6 : జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలను నిర్మూలించేందుకు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం గంజాయి విక్రయాలకు పాల్పడుతూ పట్టుబడ్డ పాత నేరస్తులను బైండోవర్ చేశారు. సూర్యనగర్‌కు చెందిన ఏల్పుల సాయిచందర్, బెల్లంపల్లికి చెందిన ఎస్‌కె జమీర్, చెన్నూరుకు చెందిన జాడి సాయిలను బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడకుండా ముందస్తుగా బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సహాయం

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 6: రక్తనిధి కేంద్రంలో చికిత్స పొందుతున్న తలసేమియా వ్యాధిగ్రస్తులకు హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ బ్రాంచ్ మేనేజర్ రాజు ఆర్థిక సహాయం అందించారు. చిన్నారులకు ఒక నెలకు సరిపడ మందుల నిమిత్తం రూ.10 వేలను అందజేశారు. సిబ్బంది మల్లేష్, నికిల్, హరి ప్రసాద్, రమేష్, ఐలయ్య, రవితేజ, సాయితేజ, మహేష్, రెడ్‌క్రాస్ జిల్లాచైర్మన్ భాస్కర్‌రెడ్డి, రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జీ మధుసూదన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు నాగేందర్, కిషన్ పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి దేవాలయానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న గ్రామస్థులు

భీమిని, జనవరి 6: మండలంలోని చిన్నగుడిపేటలో నిర్మించనున్న పెద్దమ్మతల్లి దేవాలయం భూమి పూజ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ అనంతరం భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సూరం మొండయ్య బానక్క, ఎర్రం శంకర్ లక్ష్మీ దంపతులచే పూజా క్రతువును కిషోర్ శర్మ చేపట్టారు. ముదిరాజ్ సంఘం సహకారంతో గ్రామానికి చెందిన దాతలు, వారిచే సుమారు రూ.35 లక్షలతో నిర్మాణం చేపట్టనున్నారు. ముదిరాజ్ సంఘం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గోదాదేవి అమ్మవారికి ఓడిబియ్యం

దండేపల్లి, జనవరి 6: తాళ్ళపేట లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి శనివారం ఓడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీశైవ క్షేత్ర వనిత శక్తి నిర్మల్ జిల్లా మేనేజింగ్ డైరెక్టర్ గోలి మాధవి ఆధ్వర్యంలో డైరెక్టర్ సిహెచ్ వాసవి, అధ్యక్షురాలు కటకం గీతరాణి సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. వనజరాణి, సుధరాణి, రాజకళ, రమాదేవి పాల్గొన్నారు.

కమ్ముకున్న పొగమంచు



మండల కేంద్రంలో ఏర్పడిన పొగమంచు

దహెగాం, జనవరి 6: దహెగాం మండల వ్యాప్తంగా ఉదయం వేళ పొగమంచు కమ్ముకుంది. శనివారం ఉదయం వేళలో పొగ మంచు కమ్మేయడంతో వాహనాలు నడిపే వారు లైట్లు వేసుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా పదిహేను రోజులుగా పొగమంచు ఇలానే కురుస్తూనే ఉండడంతో మిర్చి, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లుతుందని వ్యవసా యాధికారులు చెబుతున్నారు. రైతులు అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ

సిర్పూర్(టి), జనవరి 6: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ శనివా రంతో ముగిసింది. మండలంలోని 16 గ్రామపంచాయతీలలో ప్రజలను సంక్షేమ పథకాల దరఖాస్తులు చేసుకున్నారు. కాగా ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ, తహసీల్దార్ కార్లాయయాల్లో ఆపరేటర్లు డాటా ఎంట్రీ పనులు ప్రారంభించారు.

చింతలమానేపల్లి: మండలంలో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ శనివారంతో ముగిసింది. మండల వ్యాప్తంగా 19 గ్రామ పంచాయతీల్లో 9599 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. అలాగే ఇతర సమస్యలపై 2,288 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. దరఖాస్తులు నేటి నుంచి ఆన్‌లైన్‌లు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

కెరమెరి: మండలంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ముగిసిం ది. చివరి రోజు సాంగ్వీ, సాకడ గ్రామల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను ఎంపీడీవో మహేందర్ పరిశీలించారు. మండల వ్యాప్తంగా 950 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం మల్లయ్య, సర్పంచ్ జగన్నాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి చుక్కల దుప్పి



వన్యప్రాణుల రక్షణపై అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

పెంచికలపేట, జనవరి 6: మండలంలోని లోడ్పల్లి గ్రామంలోకి శనివారం చుక్కల దుప్పి దారి తప్పి వచ్చింది. దుప్పిని వీధి కుక్కలు తరుముతుం డడంతో అలిశెట్టి ప్రసాద్ అనే వ్యక్తి చూసి వాటిని తరిమివేశాడు. అనంతరం అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చాడు. అక్కడ కు చేరుకున్న అటవీ శాధికా రులు ప్రజలకు వన్యప్రాణు ల రక్షణ పై అవగాహన కల్పించారు. అనంతరం సమీప అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు. కార్యక్రమంలో బీట్ అధికారులు అరుణ్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ మిల్లు కాలుష్యంపై ఎమ్మెల్యే ఫిర్యాదు

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 6: సిర్పూరు పేపర్ మిల్లు వెదజల్లుతున్న కాలుష్యంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు విమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు శనివారం ఫిర్యాదు చేశారు. పేపర్ మిల్లు నుంచి వెలువడుతున్న వాయు, జల కాలుష్యంతో పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వివరించారు. హైదరాబాద్‌లోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శి శ్రీ కృష్ణ ఆదిత్యను కలిసి మిల్లుపై చర్యలు తీసుకోవాలని ప్రత్యేక టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలని ఆయన ఫిర్యాదులో కోరారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీరాంపూర్, జనవరి 6: కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కె వీరభద్రయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా అన్నారు. ఆర్‌కె 5 గనిని శనివారం సందర్శించి కార్మికులతో మా ట్లాడా రు. వారి సమస్యల పరిష్కారానికి యాజమాన్యంతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, పిట్ కార్యదర్శి నర్సింగరావు, విశ్వనాథ్‌రెడ్డి, లక్కిరెడ్డి, సత్తిరెడ్డి, మల్లేష్, మధునయ్య పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన నాయకులు

జైపూర్, జనవరి 6: సింగరేణి సీఎండీ ఎన్.బలరాంను శనివారం హెచ్‌ఎంఎస్ ఎస్టీపీపీ నాయకులు హైద్రాబాద్ లోని సింగరేణి భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా వారు సీఎండీకి ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు ఎస్టీపీపీ హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ విక్రమ్ , వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌లు తెలిపారు. సీఎండీని కలిసిన వారిలో ఎస్టీపీపీ హెచ్‌ఎంఎస్ నాయకులు చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణ, మల్లేష్, రమేష్, నవీన్, రాజేందర్‌లు ఉన్నారు.

సీఐఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయాన్ని ఫంక్షన్ హాల్‌కు కేటాయించాలి

మంద మర్రి టౌన్, జనవరి 6: పట్టణంలోని వేంకటేశ్వర ఆలయం పక్కన గల సీఐఎస్‌ఎఫ్ కార్యాలయాన్ని కార్మికుల ఫంక్షన్ హాల్ కోసం కేటాయించాలని కోరుతూ శనివారం ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య జీఎం మనోహర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

శ్రీరాంపూర్, జనవరి 6: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం (140/2018) ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గడ్డం వివేక్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, సంఘం కేంద్ర అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ రావు, ఉపాధ్యక్షుడు ఎంవి రావు, శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు డేగల ప్రవీణ్ పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు

వాంకిడి, జనవరి 6: వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ పీవో చంద్రయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు చెత్తాచెదారం తొలగించారు. కళాశాల ఆవరణలో పరిశుభ్రత లోపించకుండా ఉండేందుకు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించినట్లు పీవో చంద్రయ్య తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



నామినేటెడ్ పదవులు బీసీలకు ఇవ్వాలి

నస్పూర్, జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం నియమించే నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బీసీలకే కేటాయించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర జనాభాలో 50 శాతం బీసీ జనాభా ఉందని, నామినేషన్ పదవులకు కూడా బీసీలకు అధిక శాతం కేటాయించాలన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన విధంగా బీసీలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

అలరించిన రంగవల్లులు

- ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలకు విశేష స్పందన
- భారీగా తరలివచ్చిన మహిళలు
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన అతిథులు



మందమర్రిలో ముగ్గులు వేస్తున్న మహిళలు



ప్రథమ విజేతకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగుళూర్... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" స్థానిక పార్టనర్ మంచిర్యాలలోని స్వరూపారాణి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. మందమర్రి సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి 1 వరకు పోటీలు జరగగా మహిళలు ఆసక్తిగా పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి 85 మంది మహిళలు పాల్గొనగా, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికి కన్సోలేషన్ బహుమతులు ముఖ్య అతిథు లుగా హాజరైన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానంద, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, స్పాన్సర్లు స్వరూప హాస్పిటల్స్ నిర్వాహకులు డాక్టర్ జానపాటి శరత్‌బాబు, డాక్టర్ ఎ.స్వరూపారాణి, కళాశాల నిర్వాహకులు హీరాలాల్ ఉపాధ్యాయ చేతుల మీదుగా అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మందమర్రికి చెందిన యశోద లక్ష్మీ, కొంపెలత, జి.పద్మావతి వ్యవహరించారు. బహుమతుల ప్రదానోత్సవం సందర్భంగా హాజరైన చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేకానంద మాట్లాడుతూ, ఫైరింగ్ పత్రిక ఆంధ్రజ్యోతి మాదిరిగా మహిళలు ఉత్సాహంతో తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. అంతరించి పోతున్న సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ కృషి చేయడం అభినందనీయమన్నారు. జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అన్ని రంగాల్లో రాణిస్తున్న నేటి మహిళలు సంస్కృతిక, సంప్రదాయాలు కాపాడడానికి ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. సంక్రాంతి పండుగ పూట మహిళలను ఉత్సాహపరిచేందుకు ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహించిన ఆంధ్రజ్యోతి యాజమా న్యానికి ధన్యవాదాలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు మాట్లాడుతూ, మహిళల కోసం వేదిక ఏర్పాటు చేసి ముగ్గుల రూపంలో వారిలోని ప్రతిభను వెలికితీసే ప్రయత్నం చేస్తున్న ఆంధ్రజ్యోతి కృషి అభినందనీయమన్నారు. స్థానిక పార్టనర్ స్వరూపా రాణి హాస్పిటల్స్ నిర్వాహకులు డాక్టర్ శరత్‌బాబు, స్వరూపారాణి మాట్లాడుతూ, ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముగ్గుల పోటీలకు స్పాన్సర్‌గా తమకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో పత్రిక పక్షాన ఏ కార్యక్రమం చేపట్టినా తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. పోటీల్లో ప్రథమ బహుమతిని మందమర్రి పట్టణానికి చెందిన శనిగారపు హేమలతకు రూ.6వేలు, ద్వితీయ, తృతీయ విజేతలుగా రామకృష్ణాపూర్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

చెందిన బొట్ల స్వర్ణలత రూ.4వేలు, జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన గాదె లలితకు రూ.3వేలను అందజేశారు. ఆంధ్రజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ డేగ సత్యం, ఏబీఎన్ రిపోర్టర్ శ్రీనివాస్, కెమెరామెన్ శ్రీనివాస్, అన్ని మండలాల విలేకరులు, సింగరేణి మందమర్రి సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బర్ల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



కన్సోలేషన్ బహుమతి అందజేస్తున్న అతిథులు, ఆంధ్రజ్యోతి సిబ్బంది



హాజరైన మహిళలు

ఆనందంగా ఉంది : ప్రథమ బహుమతి విజేత హేమలత

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచి పాల్గొంటున్నాను. దాదాపు 15 ఏళ్లకు పైగా ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నందుకు ఆనందంగా ఉంది. గతేడాది రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతి పొందాను. ఈ సారి కూడా రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధిస్తా ననే నమ్మకం ఉంది. ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటున్నాం.





ప్రథమ బహుమతి పొందిన ముగ్గు, విజేత హేమలత

ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు : ద్వితీయ బహుమతి విజేత స్వర్ణలత

ఎనిమిదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. ద్వితీయ బహుమతి సాధించడం ఆనందంగా ఉంది. ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు. ఇలాంటి ముగ్గుల పోటీలు యేటా నిర్వహించడం గొప్ప విషయం.





ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, విజేత స్వర్ణలత

సృజనాత్మకతను వెలికితీయడం సంతోషంగా ఉంది : తృతీయ బహుమతి విజేత లలిత

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీల ద్వారా మహిళల్లో సృజనాత్మకతను వెలికితీయడం సంతోషంగా ఉంది. 2007 నుంచి యేటా ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. గతంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాను.





తృతీయ బహుమతి పొందిన ముగ్గు, విజేత లలిత


ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల నిరసన



మల్కేపల్లి కొనుగోలు కేంద్రం వద్ద రైతుల నిరసన

కాసిపేట, జనవరి 6: ధాన్యం కొనుగోలు చేయాలని శనివారం మల్కేపల్లి కొనుగోలు కేంద్రం వద్ద రైతులు నిరసన చేపట్టారు. రైతు సంఘం నాయకుడు బండారి శ్రీను మాట్లాడుతూ నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి తరలించామని, ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ధాన్యాన్ని కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం చేస్తున్న సొసైటీ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని, లేదంటే రెండు రోజుల్లో తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులు ఈర్ల లక్ష్మణ్, ముత్యాల మల్లేష్, బొద్దుల కుమార్, లచ్చన్న, శ్రీనివాస్, రాజు, సమ్మయ్య, శేఖర్, నగేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు



మాట్లాడుతున్న డీటీడీవో గంగారాం

జన్నారం, జనవరి 6: జిల్లాలో వెనకబడిన గిరిజన తెగల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందని డీటీడీవో మడావి గంగారాం అన్నారు. శనివారం కొత్తపేటలో ప్రధానమంత్రి జాతీయ ఆదివాసీ న్యాయ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏడు మండలాల్లోని 21 గ్రామాల్లో వెనకబడిన కోలాం, తోటి గిరిజన తెగలకు చెందిన 458 కుటుంబాల్లోని 1677 మందిని గుర్తించినట్లు తెలిపారు. వీరికి ప్రధాన మంత్రి జన్మన్ పథకం కింద పక్కా ఇండ్లతోపాటు నివసిస్తున్న గ్రామాలకు రోడ్లు, అంగన్‌వాడీ సెంటర్లు, హెల్త్ సెంటర్ల ఏర్పాటు, అంత్యోదయ కార్డులను అందజేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని 18 రాష్ట్రాల్లో ప్రధాన మంత్రి జన్మన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. సర్పంచు మాలవత్ లావణ్య, ప్రేంసింగ్, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో అరుణరాణి, పంచాయతీ కార్యదర్శి భీంరావు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీగా జుబేర్

తాండూర్, జనవరి 6: యూత్ కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీగా తాండూర్ గ్రామానికి చెందిన ఎండీ జుబేర్ నియమితులయ్యారు. శనివారం ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు నియామక పత్రం అందించారు. నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పోచంపల్లి హరీష్, నాయకులు రమేష్‌బాబు, ప్రదీప్, సాయికిరణ్ పాల్గొన్నారు.



నియామక పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- గూడెం ఎత్తిపోతల పథకం నీటి విడుదల

దండేపల్లి, జనవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. యాసంగి సాగు కోసం గూడెం ఎత్తిపోతల నీటిని శనివారం కలెక్టర్ సంతోష్‌తో కలిసి పూజలు చేసి నీటిని విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గూడెం ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులకు వరంలాంటిదన్నారు. వార బందీ పద్ధతిలో నీళ్ల అందిస్తున్నందున రైతులు సహకరించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించాలన్నారు. తానిమడుగు డీ30 నుంచి హాజీపూర్ మండలం డీ42 డిస్ట్రిబ్యూటర్ వరకు సుమారు 15వేల ఎకరాలకు నీరందిస్తామన్నారు. 90 రోజులపాటు ఆరుతడి పంటలకు సాగునీరు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. చెరువులు, కుంటలు, బావులో నీరు నింపేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వానాకాలం ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు, తరుగు దోపిడిని పూర్తిగా నివారించామన్నారు. ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ గడ్డం నాగరాణిత్రిమూర్తి, తహసీల్దార్ సంధ్యరాణి, నీటి పారుదల శాఖ డీఈలు దశరథం, వెంకటేశ్వర్లు, ఏఈలు జాకీర్, అశ్విన్, శ్రీధర్, సంజీవ్, రాజేందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, పాల్గొన్నారు.



గూడెం ఎత్తిపోతల వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రమేష్



కాసిపేట, జనవరి 6: తెలంగాణ ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రమేష్ ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుర్రి రాజు ఏకగ్రీవం గా ప్రకటించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనిల్, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, కోశాధికారిగా స్వామి, ఉపా ధ్యక్షుడిగా దేవేందర్, సంయుక్త కార్యదర్శిగా సత్యం, కార్య వర్గసభ్యులుగా కవిత, మహేందర్‌లను ఎన్నుకున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏసీసీ, జనవరి 6: పాత మంచిర్యాలలోని 132కేవీ సబ్ స్టేషన్ వద్ద లైన్ వర్క్ జరుగుతున్నందున ఆదివారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీసీ, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు





ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, కలెక్టర్‌కు అవిశ్వాసం తీర్మానం అందజేస్తున్న కౌన్సిలర్లు

లక్షెట్టిపేట రూరల్, జనవరి 6: లక్షెట్టిపేట మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు శనివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రెండో వార్డు కౌన్సిలర్ గడికొప్పుల ఉమాదేవి, 15వ వార్డు కౌన్సిలర్ షబానాసజ్జులతోపాటు లక్షెట్టిపేటకు చెందిన న్యాయవాది సిహెచ్ సుమన్ చక్రవర్తి పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెల్ల నాగభూషణం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్, మండల అధ్యక్షుడు మహ్మద్ ఆరీఫ్, కౌన్సిలర్లు గొడిసెల లక్ష్మీ, రాందేని వెంకటేష్ పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

లక్షెట్టిపేట మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ ఛైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్‌ఛైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్‌లపై కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రకటించారు. శనివారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు అవిశ్వాస తీర్మానం పత్రాన్ని అందజేశారు. మొత్తం 15 మంది ఉండగా బీఆర్‌ఎస్ పార్టీ తొమ్మిది, కాంగ్రెస్ పార్టీ 5గురు, ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి గెలిచారు. ఇప్పటికే ఇండిపెండెంట్ అభ్యర్థి పదోవార్డు కౌన్సిలర్ లక్ష్మీ, 1వవార్డు కౌన్సిలర్ సురేష్‌నాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల సంఖ్య ఏడుకు చేరింది. శనివారం మరో ఇద్దరు చేరడంతో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల సంఖ్య తొమ్మిదికి చేరింది. 9వ వార్డు కౌన్సిలర్ ఓరగంటి శ్రీకాంత్ అవి శ్వాసానికి మద్దతు తెలపడంతో పది మంది కౌన్సిలర్లతో కోరంనిండింది. కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం అందజేశారు.

ఆన్‌లైన్ ద్వారా జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ పోటీలు

ఏసీసీ, జనవరి 6: జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 102 మంది విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 18లోగా ప్రాజెక్టుకు సంబంధించిన వీడియో, ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. విద్యార్థులు మొబైల్‌లో ప్లేస్టోర్ నుంచి మనక్ కాంపిటేషన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారని, జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి రూ.10 వేల నగదు అందిస్తామని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మధుబాబు 9849550200లో సంప్రదించాలన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

నెన్నెల, జనవరి 6: మండలంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు పని దినాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇటీవల ప్రచురించిన ముసాయిదా ఓటరు లిస్టు ఆయా కేంద్రాల్లో శనివారం నుంచి ప్రదర్శిస్తామన్నారు. అందులో ప్రతీ ఒక్కరు తమ పేరుతో పాటు ఇతర వివరాలను చూసి నిర్ధారించుకోవాలన్నారు. పేర్లు, తప్పుల సవరింపులు చేసుకునే వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు కోసం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల నాటికి అర్హులందరికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.